క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ అండర్-14, 17పోటీలకు మండలం నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు మండల విద్యాధికారి వదరరాజు బుధవారం తెలిపారు. హుస్నాబాద్‌లో మంగళవారం జరిగిన ఉమ్మడి మెదక్ పోటీలల్లో మద్దూరు మోడల్ స్కూల్ విద్యార్థులు ఐశ్వర్య, మాన్యత, విశ్వతేజ, లద్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రజినీకాంత్ ప్రతిభచూపి జిల్లా జట్టులో స్థానం సంపాందించారని, వారు నారాయణపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

విద్యార్థులకు అభినందనలు

హుస్నాబాద్: ఉమ్మడి మెదక్ జిల్లా బాలుర జట్టుకు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఎం.శివబాలాజీ, బాలికల విభాగంలో కె.ప్రశాంత ఎంపికైనట్లు పీడీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 30న హుస్నాబాద్‌లో ఉమ్మడి జిల్లా హ్యాండ్ పోటీలలో వారు ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, హెచ్‌ఎం వాసుదేవారెడ్డి బుధవారం అభినందించారు.

వృత్తి విద్యా శిక్షణ

బెజ్జంకి(సిద్దిపేట): ఒకేషనల్ విద్యార్థులకు వృత్తి విద్యలో నైపుణ్యం పెంచేందుకు స్థానిక మాడల్ స్కూల్‌లో గురువారం నుంచి నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఖలీదా శిరీన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు వృత్తి విద్య, మల్టీమీడియా విభాగాలలో పదిరోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు.

నిజాయితీకి నిదర్శనం శాస్త్రి



నివాళులర్పిస్తున్న నాయకులు

దుబ్బాకటౌన్: నీతి, నిజాయితీకి నిదర్శనం లాల్‌బహదూర్ శాస్త్రి అని, ఆయన దేశానికి రెండో ప్రధానిగా అందించిన సేవలు మరువలేనివని దుబ్బాక యువజన సంఘాల నాయకులు మల్లికార్జున్, పరశురాములు అన్నారు. బుధవారం శాస్త్రి జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

బాధితులకు భరోసా



బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆపదలో ఉన్న బాధిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చెన్నాయి బాల్‌రాజవ్వ, ర్యాకం రాజయ్య, గొట్టం కనకయ్య కుటుంబాలను బుధవారం ఆయన ఇతర నాయకులతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట అంజిరెడ్డి, భైరయ్య, ఐలయ్య, మల్లయ్య, సత్తయ్య, కిష్టయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణ సంస్థ భవనం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు

సిద్దిపేటకమాన్: పట్టణంలో యూనియన్ గ్రామీణ స్వయంఉపాధి శిక్షణ సంస్థ నూతన భవనాన్ని బుధవారం వర్చువల్‌గా ముంబయి కార్యాలయం నుంచి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాఎండీ, సీఈఓ మణిమేకలై ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణసంస్థ అధికారులు మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 5వేల మంది యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు, సంస్థ అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చేర్యాల(సిద్దిపేట): సీఎం రేవంత్‌రెడ్డి పేదల పెన్నిధి అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన బాధితులకు బుధవారం ఆయన సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఆయన వెంట ఆయా గ్రామాల నాయకులున్నారు.

గాంధీ ఆశయాలను కొనసాగిద్దాం



సిద్దిపేటజోన్: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి



సిద్దిపేటకమాన్: గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి



దుబ్బాకటౌన్: గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ వనిత

మహాత్మాగాంధీ జయంతి వేడుకలు అన్ని మండలాల్లోను ఘనంగా జరిగాయి. గ్రామాలు, పట్టణాల్లోని ప్రభుత్వ, వివిధ పార్టీల కార్యాలయాలలో అధికారులు, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లో అధికారులు పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. స్వతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ వారితో శాంతియుతంగా పోరాడిన మహాత్మా గాంధీ ఆశయాలను అందరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు.



సిద్దిపేటజోన్: గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు



మిరుదొడ్డి(దుబ్బాక): పూలమాల వేస్తున్న చంద్రశేఖర్



కొమురవెల్లి(సిద్దిపేట): కాంగ్రెస్ నేతల నివాళి



జగదేవ్‌పూర్(గజ్వేల్): నివాళులర్పిస్తున్న నాయకులు



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో..

కేసీఆర్‌పై మైనంపల్లి వ్యాఖ్యలు సరికాదు

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్/సిద్దిపేటజోన్/చిన్నకోడూరు(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్/తొగుట(దుబ్బాక): కేసీఆర్‌ను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేసిన వ్యాఖ్యలు సరికావని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ ముంపు గ్రామాల్లో అన్యాయం జరిగిందంటూ చెప్పడంలో అర్థం లేదన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితులను మాజీ సీఎం కేసీఆర్ అక్కున చేర్చుకున్నారని, నిర్వాసితులైన అందరికీ అండగా నిలిచారని గుర్తు చేశారు. సిద్దిపేటపై అక్కసుతో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం మండిపడ్డారు. సమావేశంలో శ్రీనివాస్, సుందర్, అరవింద్‌రెడ్డి, షాహిద్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెప్పు కోసం మైనంపల్లి హన్మంతరావు రౌడీలా వ్యవహరిస్తున్నారని, భాష మార్చకోకపోతే తగిన బుద్ధి చెబుతామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ హెచ్చరించారు. ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు, కేటీఆర్‌ను దూషించిన మైనంపల్లి హనుమంతరావుపై చర్యలు తీసుకోవాలని సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు బీఆర్‌ఎస్ నాయకులు సాయిరాం, రాజనర్సు, బ్రహ్మం తదితరులు తెలిపారు. అలాగే తొగుట పోలీస్ స్టేషన్‌లోను మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి మాట్లాడుతూ మైనంపల్లిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వామి, రమేశ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా మంత్రిని అవమానించడం సిగ్గుచేటు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీఆర్‌ఎస్ నాయకులు మహిళా మంత్రిని అవమానించడం సిగ్గుచేటని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. మంత్రి కొండా సురేఖపై బీఆర్‌ఎస్ నాయకులు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి దీనికి బాధ్యత వహిస్తూ మంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రవి, శ్రీనివాస్, రాజిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, నరేశ్, వెంకట్‌గౌడ్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. చక్రధర్‌గౌడ్ బీఆర్‌ఎస్ కోవర్టు అని, స్వలాభం కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. అత్తు ఇమామ్, లక్ష్మి, యాదగిరి పాల్గొన్నారు.

కేటీఆర్ మాటతీరు మార్చుకోవాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): కేటీఆర్ తన మాటతీరు మార్చుకోవాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దయానంద్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కేటీఆర్ ఓటమిని జీర్ణించుకోవడం లేదని, మహిళలపై ఆగౌరవంగా మాట్లాడడం మంచిది కాదన్నారు. కృష్ణ, రాజేశం, భిక్షపతి, నర్సింహారెడ్డి, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం



ఎంఈఓలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ ఫోరం ప్రతినిధి మోహన్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: పట్టణంలోని ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం భవనాన్ని నిర్మించి నాలుగేళ్లు గడిచినా ఫర్నిచర్ లేకపోవడంతో నిరుపయోగంగా ఉందని గణిత ఉపాధ్యాయ ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఫోరం ఆధ్వర్యంలో బుధవారం టీచర్ ట్రైనింగ్ సెంటర్‌లో అక్కన్నపేట, హుస్నాబాద్ నూతన ఎంఈఓలు రంగానాయక్, బండారి మనీలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి రూ.కోటి నిధులు కేటాయిస్తే భవన నిర్మాణం పూర్తయిందని, అలాంటి భవనం నిరుపయోగంగా ఉండడం దారుణం అన్నారు. ఫర్నిచర్ విషయం మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, రవీందర్, మురళి, రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, చంద్రమౌలి తదితరులు పాల్గొన్నారు.

వర్గల్ పెద్ద చెరువు గండి పరిశీలన



గండిని పరిశీలిస్తున్న నర్సారెడ్డి

వర్గల్(గజ్వేల్): వర్గల్ పెద్దచెరువునకు ఏర్పడిన గండిని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి బుధవారం పరిశీలించారు. 'రెండేళ్ల క్రితం గండి.. మరమ్మతులు ఎప్పుడండీ' శీర్షికతో పెద్దచెరువు దుస్థితి గురించి గత నెల 27న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. దీంతో ఆయన చెరువును సందర్శించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. నిధుల కేటాయింపు తదితర అంశాలను చర్చించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు జరిగేలా చూస్తామని చెప్పారు. బతుకమ్మ పండుగకు ఆటంకం లేకుండా తాత్కాలికంగా గండి ప్రాంతాన్ని మట్టితో చదును చేయాలని సూచించారు.

సాక్షి ఎఫెక్ట్

కులరహిత సమాజమే ధ్యేయం

కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: కులరహిత సమాజ నిర్మాణమే కేవీపీఎస్ ధ్యేయమని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మరాఠి కృష్ణమూర్తి అన్నారు. 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని డివిజన్ కార్యాలయంలో బుధవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు పౌర హక్కుల గురించి ఎప్పటికప్పుడు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రక్షణ కల్పించాలని, కులవివక్ష పాటించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుమార్, రాజు, వెంకటచారి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో బతుకమ్మ

అన్ని మండలాల పరిధిలోని గ్రామాల్లో బతుకమ్మ పండుగ బుధవారం ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి, ఆచార వ్యవహారలకు అద్దంపట్టే ఈ వేడుకల్లో భాగంగా మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ(పెత్రమాస) పండుగగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు ఉదయం నుంచే తీరొక్క పూలను సేకరించి భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చి పూజలు నిర్వహించారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా మహిళలందరూ ఆనందోత్సవాల మధ్య బతుకమ్మలు ఆడి పాడారు. గ్రామాల్లోని ఆలయాల వద్ద ఎంగిలి పూల బతుకమ్మ పండుగను మహిళలు సంతోషంగా జరుపుకున్నారు.



కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆలయ పరిసరాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో..



నంగునూరు(సిద్దిపేట): నంగునూరులో..



హుస్నాబాద్: బతుకమ్మ ఆటపాటలను తిలకిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



కొండపాక(గజ్వేల్): రవీంద్రనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సంక్షిప్త వార్తలు

◆ భూనిర్వాసితులకు న్యాయం చేస్తాం

వర్గల్(గజ్వేల్): ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్‌లో భూములు కోల్పోయిన వర్గల్ భూనిర్వాసితులకు న్యాయంచేస్తామని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి హామీ ఇచ్చారు. పరిశ్రమల ప్రాంతంలో భూనిర్వాసితుల ఆందోళన శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఎకరానికి రూ.10లక్షల పరిహారమిచ్చి రూ.కోట్ల విలువైన భూములను టీజీఐఐసీకి అప్పగించిందన్నారు. అర్హులకు ప్లాట్లు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

◆ కార్మికులకు అండగా ఉంటాం..

సిద్దిపేటజోన్: భవన నిర్మాణ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ అన్నారు. స్థానిక గాంధీ చౌక్ వద్ద కార్మికులు బుధవారం ఆయనను కలిసి సమస్యలను వివరించారు. అందరికీ పని లభించేలా కాంట్రాక్టర్లతో మాట్లాడి న్యాయం చేస్తానని, ప్రభుత్వ పరంగా సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. లక్ష్మి, అత్తు, ఆనంద్, రియాజ్, ఎల్లం, వహిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

◆ లైన్‌మెన్‌కు గ్రామస్తుల సన్మానం

కొండపాక(గజ్వేల్): మండలంలోని బందారంలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న హసన్‌ను గ్రామస్తులు బెస్ట్ అధికారిగా గుర్తించి గాంధీ జయంతిని పురస్కరించుకొని ఘనంగా సన్మానించారు. విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు వెంటనే స్పందించి పరిష్కరిస్తూ అందరి మన్ననలను పొందాడని గ్రామస్తులు తెలిపారు. ఆయనకు సహకరిస్తున్న కనకయ్య, వెంకటచారిని సైతం సన్మానించారు.

◆ చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

గజ్వేల్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని సీఐ సైదా సూచించారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లకు అపరిచితులు పంపించే ఓటీపీలు, మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. గంజాయి, డ్రగ్స్ బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ పీఎంఎస్‌రావు, మేజర్ రామ్‌హరి, ఏఎన్‌ఓ మహేందర్ రెడ్డి, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

◆ అభివృద్ధి పనులకు సహకరించండి

నంగునూరు(సిద్దిపేట): గ్రామంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని ప్రత్యేక అధికారులు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఉపాధిహామీ పథకం కింద చేపట్టనున్న పనులపై అవగాహన కల్పించి పేర్లను నమోదు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ డిజిటల్ కార్డులపై సమగ్ర సర్వే

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం త్వరలో అందించనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం నాగరాజుపల్లిలో వారం రోజుల పాటు సర్వే నిర్వహిస్తామని తహసీల్దార్ సరిత బుధవారం చెప్పారు. గురువారం నుంచి 8వ తేదీ వరకు ఎంపీడీఓ లక్ష్మణప్ప, ఎంపీఓ సత్యనారాయణతో కలిపి మూడు టీమ్‌లను ఏర్పాటు చేశామని, ప్రతి టీమ్‌కు ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను ఎంపిక చేశామని, ఇంటింటా తిరిగి సర్వే చేపడతామని ఆమె తెలిపారు.

◆ పేద కుటుంబానికి చేయూత

గజ్వేల్‌రూరల్/మద్దూరు(హుస్నాబాద్): అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన బాధిత కుటుంబానికి తోటి మిత్రులు చేయూతను అందించి మనోధైర్యం కల్పించారు. గజ్వేల్‌లోని పదో వార్డుకు చెందిన శ్రీనివాస్ రెండేళ్ల క్రితం మృతి చెందగా, అతడి భార్య వాణి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న అతని మిత్రులు బుధవారం పరామర్శించి రూ.28వేలు అందజేసి మనోధైర్యం కల్పించారు. శ్రీనివాస్, ఆంజనేయులు, భగవంత్‌చారి, ఆనంద్, యాదగిరి, మహేందర్‌రెడ్డి, తులసీదాస్, రాజు పాల్గొన్నారు. అలాగే మద్దూరు మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన జగ్గని యోహాను అనారోగ్యంతో మరణించగా మృతుడి కుటుంబాన్ని మండల బీసీ సెల్ అధ్యక్షుడు సత్యనారాయణ పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

◆ 14లీటర్ల గుడుంబా పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి శివారులోని పొలాల వద్ద 14లీటర్ల గుడుంబాను బుధవారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు. గ్రామంలోని పౌల్ట్రీ ఫారంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కరీంనగర్ జిల్లా గునుకుల కొండాపూర్‌కు చెందిన నారాయణ గుడుంబా విక్రయిస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడిచేశారు. గుడుంబాను స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

◆ సౌండ్ బాక్స్‌ల అందజేత

చిన్నకోడూరు(సిద్దిపేట): బీసీ కాలనీలో బతుకమ్మ సంబరాలకు రాజేశ్వర్‌రెడ్డి రూ.20వేల విలువైన సౌండ్ బాక్స్‌లను బుధవారం అందజేశారు.